క్లుప్తంగా

22న ధర్నా

శృంగవరపుకోట: ఉపాధి హామీ పనుల వేతన దారుల డిమాండ్ల సాధనే లక్ష్యంగా ఈ నెల 22వ తేదీన కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహిస్తున్నట్లు సీఐటీయూ జిల్లా కార్యదర్శి మద్దిల రమణ తెలిపారు. మండల కేంద్రంలోని నడ బందలో జరుగుతున్న ఉపాధి హామీ పనుల ప్రదేశానికి గురువారం వెళ్లిన ఆయన వేతనదారులతో కాసేపు మాట్లాడారు. ఉపాధి హామీ పనులకు సంబంధించి, 30 శాతం నిధులను కేంద్ర ప్రభుత్వం తగ్గించిందని, దీంతో పాటు మెటీరియల్ పనులు పెంచి, ఉపాధి లేకుండా చేస్తోందని వివరించారు. వేతనదారులతో ఒక్కపూట మాత్రమే పనులు చేయించాలని, ఏడాదికి 200 పనిదినాలు కల్పించాలని, రోజుకు రూ.600 వేతనం అందివ్వాలని కోరారు. ఇవే డిమాండ్లతో చేపట్టే ధర్నాకు అందరూ వచ్చి, జయప్రదం చేయాలని కోరారు.

అధికారుల ఆకస్మిక తనిఖీ



ప్రైవేట్ రైస్ దుకాణంలో తనిఖీలు నిర్వహిస్తున్న పౌరసరఫరాల శాఖ అధికారులు

చీపురుపల్లి: స్థానిక పట్టణంలోని రేషన్ షాపులు, ప్రైవేట్ రైస్ దుకాణాల్లో పౌరసరఫరాల శాఖ అధికారులు గురువారం ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. జేసీ మయూర్ అశోక్ ఆదేశాల మేరకు రాజాం డిప్యూటీ తహసీల్దార్ ఎస్.చిరంజీవి, గరివిడి డిప్యూటీ తహసీల్దార్ సీహెచ్ శోభారాణి, చీపురుపల్లి పౌరసరఫరాల డిప్యూటీ తహసీల్దార్ పిన్నింటి రామారావు నేతృత్వంలో పట్టణంలోని మెయిన్ రోడ్డు, గాంధీబొమ్మ జంక్షన్, విజయ కాలనీల్లో సోదాలు చేపట్టారు. రేషన్ షాపుల ద్వారా అందుకున్న బియ్యాన్ని లబ్ధిదారులు ప్రైవేట్ దుకాణాలకు విక్రయిస్తున్నారన్న ఆరోపణల నేపథ్యంలో ఈ తనిఖీ చేపట్టామని, వంగపల్లిపేట రేషన్ షాపులో స్టాక్ పరిశీలించామని, అక్కడ ఎటువంటి తేడాలు లేవని స్పష్టం చేశారు.

నేడు ఇసుక వేలం

శృంగవరపుకోట: స్థానిక పోలీస్‌స్టేషన్‌లో శుక్రవారం ఇసుక వేలం వేయనున్నట్లు ఎస్‌ఐ తారకేశ్వరరావు ఓ ప్రకటనలో గురువారం వెల్లడించారు. వివిధ సమయాల్లో చేపట్టిన ఆరు కేసుల్లో పట్టుబడిన దాదాపు 11 టన్నుల ఇసుకను వేలం వేయనున్నామని, ఔత్సాహికులంతా ఉదయం 11 గంటలకు జరిగే వేలంలో పాల్గొని, ఇసుక సొంతం చేసుకోవాలన్నారు.

నూతన కార్యవర్గం ఎన్నిక

చీపురుపల్లి: స్థానిక ఆర్యసమాజం భవనంలో దివ్యాంగుల హక్కుల పోరాట సమితి మండల నూతన కార్యవర్గం ఎన్నిక గురువారం నిర్వహించారు. అధ్యక్షుడిగా పి.రామకృష్ణ, ఉపాధ్యక్షుడిగా పి.లక్ష్మణ, ప్రధాన కార్యదర్శిగా టి.లక్ష్మణరావు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. అంతకు ముందు దివ్యాంగుల హక్కుల పోరాట సమితి రాష్ట్ర ఉపాధ్యక్షుడు కె.వై.డి.నాయుడు మాట్లాడుతూ దివ్యాంగుల సంక్షేమం కోసం ప్రభుత్వం మరిన్ని చర్యలు తీసుకోవాలన్నారు. దివ్యాంగులకు ఇళ్ల స్థలాలు, పక్కా ఇళ్లు మంజూరు చేయాలని, నెలకు రూ.3 వేలు నుంచి రూ.60 వేలు పెన్షన్ ఇవ్వాలని, అలాగే ఎటువంటి షరతులు లేకుండా రూ.5 లక్షల వరకు రుణ సదుపాయం కల్పించాలని కోరారు. కార్యక్రమంలో దివ్యాంగుల హక్కుల పోరాట సమితి జిల్లా అధ్యక్షుడు ఎస్.శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

నియామకపత్రం అందజేత



నియామకపత్రం అందజేస్తున్న ఎమ్మెల్యే శ్రీనివాసరావు

లక్కవరపుకోట: ఉపాధి హామీ పనులకు సంబంధించి, మండలంలోని జమ్మాదేవిపేట గ్రామ క్షేత్ర సహాయకురాలిగా ఎంపికైన దాసరి శ్యామలదేవికి ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు చేతులమీదుగా గురువారం నియామక పత్రం అందజేశారు. చిత్తశుద్ధి, నిబద్ధతతో పనిచేసి, మంచి ఉద్యోగిగా పేరొందాలని ఎమ్మెల్యే ఆకాంక్షించారు. కార్యక్రమంలో ఎంపీపీ జి.శ్రీనివాసరావు, జెడ్పీటీసీ టి.వరలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

నవధాన్యాల సాగుతో నేల సారవంతం



రైతులకు నవధాన్యాల కిట్లు అందజేస్తున్న ప్రకృతి వ్యవసాయం విభాగం అధికారి ప్రకాష్‌రావు

గంట్యాడ: నవధాన్యాల సాగుతో నేల సారవంతమవుతుందని, తద్వారా అధిక దిగుబడులు వస్తాయని ప్రకృతి వ్యవసాయం విభాగం అధికారి ప్రకాష్‌రావు అన్నారు. మండలంలోని వసాది, తామరపల్లి గ్రామాల్లోని రైతు భరోసా కేంద్రాల్లో రైతులకు నవధాన్యాల కిట్లు గురువారం పంపిణీ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ నవధాన్యాలు సాగు చేస్తే నేలలో తేమశాతం ఎక్కువగా ఉంటుందని, మొక్కకు కావాల్సిన అన్ని పోషకాలు లభ్యమవుతాయన్నారు. కార్యక్రమంలో వసాది గ్రామ సర్పంచ్ బండారు సూర్యారావు పాల్గొన్నారు.

అభివృద్ధి, సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

- 'గడప గడపకు మన ప్రభుత్వం'లో ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు



వృద్ధురాలికి సంక్షేమ పథకాలు వివరిస్తున్న ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు

లక్కవరపుకోట: రాష్ట్ర అభివృద్ధి, ప్రజా సంక్షేమమే వైఎస్సార్ సీపీ ప్రభుత్వ ధ్యేయమని ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు అన్నారు. మండలంలోని తలారి గ్రామ సచివాలయం పరిధిలో గురువారం నిర్వహించిన గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యేకు గ్రామస్తులు ఘన స్వాగతం పలికారు. అనంతరం ఇంటింటికీ వెళ్లిన ఆయన నాలుగేళ్లుగా ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధి పనులు, అమలు చేస్తున్న పథకాలను వివరించారు. ఏవైనా సమస్యలున్నా, అర్హులై ఉండి ఎవరికైనా పథకాలు అందకపోయినా వెంటనే తెలియజేయాలన్నారు. ఈ క్రమంలో పలువురు ఆయన దృష్టికి తీసుకువచ్చిన చిన్నచిన్న సమస్యలను పరిష్కరించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. 192 రోజులుగా చేస్తున్న ఈ కార్యక్రమంలో 30 వేల గడపలకు వెళ్లినప్పుడు, తన దృష్టికి వచ్చిన సమస్యల్లో 80 శాతానికి పైగా సమస్యలు పరిష్కరించానన్నారు. అన్ని వర్గాల అభ్యున్నతే లక్ష్యంగా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అహర్నిశలు శ్రమిస్తున్నారన్నారని, అన్ని వర్గాలకు అన్ని రంగాల్లో సమన్యాయం కల్పించాలన్నదే ఆయన ముఖ్య ఉద్దేశ్యమన్నారు. ప్రతీ ఇంటికి మేలు జరిగేలా ఆయన అమలు చేస్తున్న పథకాలతో గడప గడపకూ లబ్ధి చేకూరుతోందన్నారు. గతంలో ఏ ఒక్క పథకం కావాలన్నా, అభివృద్ధి పని జరగాలన్నా టీడీపీ జన్మభూమి కమిటీల చుట్టూ కాళ్లరిగేలా తిరగాల్సిన దుస్థితి ఉండేదన్నారు. ప్రజలు ఎటువంటి కష్టాలు అనుభవించకూడదనే గ్రామాల్లోకి సచివాలయ, వలంటీర్ల వ్యవస్థలను ప్రభుత్వం తీసుకువచ్చిందన్నారు. సచివాలయ వ్యవస్థతో ప్రజల వద్దకు ప్రభుత్వ సేవలు, వలంటీర్ వ్యవస్థతో ఇంటింటికీ సంక్షేమ పథకాలు చేరవేస్తున్న ఘనత జగనన్న సర్కారుకే దక్కుతుందన్నారు. ప్రజలకు చేస్తున్న మేలును చూసి ఓర్వలేకనే ప్రతిపక్షాలు, ఎల్లో మీడియా ప్రభుత్వంపై లేనిపోని ఆరోపణలు చేస్తున్నాయని, అయితే వాటిని ప్రజలు నమ్మడం లేదన్నారు. వచ్చే ఎన్నికల్లోనూ ఇదే ప్రభుత్వాన్ని ఆశీర్వదించాలని, మళ్లీ సీఎం జగనన్ననే మరోసారి ముఖ్యమంత్రిని చేయాలని ఎమ్మెల్యే కోరారు. కార్యక్రమంలో డీసీసీబీ చైర్మన్ వి.చిన్నరామునాయుడు, ఎంపీపీ జి. శ్రీనివాసరావు, జెడ్పీటీసీ సభ్యురాలు టి.వరలక్ష్మి, దాసుళ్లపాలెం సర్పంచ్ ఎం.ధనలక్ష్మి, మండల పార్టీ అధ్యక్షుడు జి. సత్యనారాయణ, స్టేట్ కార్పొరేషన్ డైరెక్టర్ జి.స్వాతిరత్నం, ఎంపీటీసీలు వై.కిశోర్, బి.గణపతి తదితరులు పాల్గొన్నారు.

దత్తిరాజేరు: మండలంలోని వింధ్యవాసి గ్రామంలో శుక్రవారం సాయంత్రం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు సర్పంచ్ రంభ చంద్రశేఖర్ ఓ ప్రకటనలో గురువారం తెలిపారు. ఎమ్మెల్యే బొత్స అప్పలనరసయ్య పాల్గొనే ఈ కార్యక్రమానికి మండల స్థాయి నేతలు, అధికారులు హాజరు కావాలని కోరారు.

సీఎం జగనన్నతోనే గాంధీజీ కలలుగన్న గ్రామస్వరాజ్యం

- ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు



రైతు భరోసా కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు

లక్కవరపుకోట: సీఎం జగనన్నతోనే గాంధీ కలలుగన్న గ్రామస్వరాజ్యం సాధ్యమని ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు అన్నారు. మండలంలోని తలారి గ్రామంలో రూ.50 లక్షల నిధులతో కొత్తగా నిర్మించిన వెల్‌నెస్ సెంటర్, రైతు భరోసా కేంద్రం భవనాలను ఎమ్మెల్యే గురువారం ప్రారంభించారు. అనంతరం సర్పంచ్‌లు ఎం.ధనలక్ష్మి, జి.జ్యోతిరత్నం ఆధ్వర్యంలో జరిగిన సమావేశంలో ఆయన పాల్గొని, కాసేపు మాట్లాడారు. రాష్ట్ర సర్వతోముఖాభివృద్ధి, ప్రజాసంక్షేమమే వైఎస్సార్ సీపీ ప్రభుత్వ లక్ష్యమన్నారు. ప్రజల ఆకాంక్షల మేర పరిపాలన కొనసాగిస్తున్న ఏకైక సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అని ప్రశంసించారు.

ఆయన తన పాదయాత్ర, ప్రజాసంకల్పయాత్రలో తెలుసు కున్న ప్రజల కష్టాలను తీర్చేందుకు అహర్నిశలు శ్రమిస్తున్నారన్నారు. ఆయన గ్రామానికి తీసుకువచ్చిన సచివాలయ వ్యవస్థతో ప్రజల వద్దకే ప్రభుత్వ సేవలు, వలంటీర్ వ్యవస్థతో లబ్ధిదారుల వద్దకే సంక్షేమ పథకాలు అందిస్తున్నారన్నారు. గతంలో ఇక్కడ ఎమ్మెల్యేగా ఉన్న కోళ్ల లలితకుమారి నియోజకవర్గ అభివృద్ధికి ఏం చేశారో చెప్పగలరా అని ప్రశ్నించారు. వైఎస్సార్ సీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత ఇదే గ్రామంలో అభివృద్ధి పనులు, సంక్షేమ పథకాల కోసం దాదాపు రూ.7 కోట్ల నిధులు కేటాయించడం జరిగిందన్నారు. అన్ని వర్గాలకు అన్ని విధాలుగా న్యాయం చేస్తున్న ఏకైక ప్రభుత్వం జగనన్న ప్రభుత్వమన్నారు. ఇదే ప్రభుత్వానికి వచ్చే ఎన్నికల్లోనూ ప్రజల ఆశీర్వాదం కావాలని కోరారు. కార్యక్రమంలో ఎంపీపీ జి.శ్రీనివాసరావు, జెడ్పీటీసీ టి.వరలక్ష్మి, ఎంపీడీఓ జి.జ్ఞానేశ్వరరావు, పంచాయతీరాజ్ జేఈ వీరలక్ష్మి, పార్టీ మండల అధ్యక్షుడు జి.సత్యనాయరాణ తదితరులు పాల్గొన్నారు.

బడిఈడు పిల్లలంతా బడిలోనే ఉండాలి

- డిప్యూటీ డీఈఓ కె.వాసుదేవరావు



మాట్లాడుతున్న డిప్యూటీ డీఈఓ వాసుదేవరావు

చీపురుపల్లి: పాఠశాలల పునఃప్రారంభం నాటికి బడిఈడు పిల్లలంతా బడిలోనే ఉండేలా చర్యలు తీసుకోవాలని డిప్యూటీ డీఈఓ కె.వాసుదేవరావు తెలిపారు. గురువారం స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాలలో అన్ని పాఠశాలల ప్రధానోపాధ్యాయులతో సమావేశమైన ఆయన నాడు–నేడు పనుల పురోగతిపై సమీక్షించారు. ఆయన మాట్లాడుతూ ఈ నెలాఖరు నాటికి పనులు పూర్తయ్యేలా చూడాలని తెలిపారు. పదో తరగతి ఫెయిల్ అయిన విద్యార్థుల ఉత్తీర్ణతే లక్ష్యంగా ప్రత్యేక తరగతులు నిర్వహించాలన్నారు. జూన్ 12 తర్వాత పాఠశాలకు వచ్చే ప్రతీ ఉపాధ్యాయుడు లెస్సన్ ప్లాన్ తప్పనిసరిగా వెంట తీసుకురావాలన్నారు. ప్రాథమిక పాఠశాలల పిల్లలకు కనీసం చతుర్విధ ప్రక్రియలు వచ్చేలా చొరవ తీసుకోవాలన్నారు. శతశాతం పిల్లలు పాఠశాలకు హాజరయ్యేలా చూడాలన్నారు. అనంతరం పదో తరగతి ఫలితాల్లో ప్రతిభ కనబరిచిన పలువురు విద్యార్థులను ఆయన అభినందించారు. కార్యక్రమంలో ఎంఈఓ ఎస్.భానుప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

'ఫ్యామిలీ డాక్టర్' సేవలను సద్వినియోగం చేసుకోవాలి



వృద్ధురాలి బీపీ చెక్ చేస్తున్న పీహెచ్‌సీ వైద్యాధికారిణి భాగ్యరేఖ

జామి: ప్రజారోగ్యమే లక్ష్యంగా ప్రభుత్వం అమలు చేస్తున్న ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం సేవలను సద్వినియోగం చేసుకోవాలని పీహెచ్‌సీ వైద్యాధికారిణి భాగ్యరేఖ కోరారు. ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమంలో భాగంగా మండల కేంద్రంలోని మాధవరాయిమెట్ట కాలనీ వద్ద గురువారం వైద్య శిబిరం నిర్వహించారు. శిబిరానికి హాజరైన పలువురికి ఆరోగ్య పరీక్షలు చేసి, అవసరమైన వారికి ఉచితంగా మందులు అందజేశారు. అనంతరం గ్రామంలోని ఇంటింటికీ వెళ్లి, మంచానపడిన రోగులకు వైద్యసేవలందించారు. ఆమె మాట్లాడుతూ ఈ కార్యక్రమం ద్వారా ప్రతీ ఇంటికి వైద్యసేవలు అందుతున్నాయన్నారు. దీర్ఘకాలిక వ్యాధులతో మంచానపడిన ఎంతోమందికి ఇదొక వరంలా మారిందన్నారు. సకాలంలో చికిత్స అందుతుండడంతో వారి ఆరోగ్యం మెరుగవుతోందన్నారు. కార్యక్రమంలో ఏఎన్ఎం భూలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

లేగదూడల ప్రదర్శన



లేగదూడల ప్రదర్శనను తిలకిస్తున్న జిల్లా పశుసంవర్ధక శాఖాధికారి రమణ

వేపాడ: మండలంలోని ఎస్.కోటసీతారాంపురం గ్రామంలో లేగదూడల ప్రదర్శన గురువారం చేపట్టారు. జిల్లా పశుసంవర్ధక శాఖాధికారి వై.వి. రమణ, డిప్యూటీ డైరెక్టర్ రామచంద్రరావు ఈ ప్రదర్శనను తిలకించి, రైతులకు పలు సూచనలు చేశారు. కృత్రిమ గర్భధారణ ద్వారా పుట్టిన ఈ లేగదూడల ఆరోగ్యం చాలా జాగ్రత్తగా చూసుకోవాలన్నారు. క్రమం తప్పకుండా విటమిన్–ఎ ఇంజెక్షన్లు వేయించాలన్నారు. అనంతరం ప్రదర్శనలో పాల్గొన్న లేగదూడల్లో మూడింటిని అత్యుత్తమ లేగదూడలుగా గుర్తించి, వాటి రైతులు పోటిపిరెడ్డి జగన్నాథం, చల్లా గణేష్, కిలపర్తి వెంకటరావుకు వరుసగా ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులుగా స్టీల్ క్యాన్లు అందజేశారు. కార్యక్రమంలో పశుగణాభివృద్ధి సంఘ కార్యదర్శి దామోదర్, ఎస్.కోట ఏడీఏ చలపతిరావు, పశువైద్యులు అనిల్‌కుమార్, శ్రీలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

నేడు వల్లంపూడిలో 'గడప గడపకు మన ప్రభుత్వం'

వేపాడ: మండలంలోని వల్లంపూడి గ్రామంలో శుక్రవారం గడప గడపకు మన ప్రభుత్వం నిర్వహిస్తున్నట్లు వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు ముమ్మలూరి జగ్గుబాబు ఓ ప్రకటనలో గురువారం వెల్లడించారు. ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు పాల్గొనే ఈ కార్యక్రమానికి మండల స్థాయి నాయకులు, కార్యకర్తలు, అధికారులంతా హాజరు కావాలని కోరారు.

మద్యానికి యువత దూరంగా ఉండాలి

గజపతినగరం: మద్యపానానికి యువత దూరంగా ఉండాలని ఎస్‌ఐ గంగరాజు సూచించారు. గురువారం స్థానిక పోలీస్‌స్టేషన్ ఆవరణలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ పేకాట, కోడిపందాలు, క్రికెట్ బెట్టింగ్ ఆడినా చర్యలు తీసుకుంటామన్నారు. అలాగే మద్యం తాగి వాహనం నడిపినా, ఆరుబయట మద్యం తాగినా చర్యలు తప్పవన్నారు. యువతీ యువకులంతా చెడు అలవాట్లకు బానిస కాకుండా ఉన్నతమైన లక్ష్యాలు ఏర్పరుచుకుని, వాటి సాధన కోసం కృషి చేయాలని కోరారు.

భక్తిశ్రద్ధలతో ప్రత్యేక పూజలు



బాబాకు పూజలు చేస్తున్న భక్తులు

గజపతినగరం: మండలంలోని ఎం.వెంకటాపురం గ్రామంలోని షిర్డీసాయిబాబా ఆలయంలో గురువారం భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. బాబాకు అత్యంత ఇష్టమైన వారం గురువారం కావడంతో గ్రామస్తులతో పాటు గజపతినగరం, పురిటిపెంట గ్రామాల నుంచి అధిక సంఖ్యలో భక్తులు ఆలయానికి చేరుకుని, విశేష పూజలు, అర్చనలు, అభిషేకాలు నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ అర్చకుడు రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

క్రీడాసామగ్రి వితరణ

శృంగవరపుకోట: మండలంలోని ధర్మవరం గ్రామ జెడ్పీ ఉన్నత పాఠశాలలో నిర్వహిస్తున్న వేసవి శిక్షణ శిబిరానికి(షటిల్) పాఠశాల విద్యాకమిటీ చైర్మన్ తగరంపూడి రమణ రూ.5 వేలు విలువైన షటిల్ కాక్(క్రీడాసామగ్రి)లు గురువారం వితరణ చేశారు. శిక్షణను సద్వినియోగం చేసుకుని, ఉన్నతమైన క్రీడాకారులుగా వెలుగొందాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో కోచ్ పి.శ్రీరాములు, టి.గోవింద్ తదితరులు పాల్గొన్నారు.

14 నుంచి అందుబాటులోకి మహిళా పార్క్



సమావేశంలో మాట్లాడుతున్న నగర మేయర్, డిప్యూటీ మేయర్, తదితరులు

విజయనగరం: జిల్లా కేంద్రంలో ఏర్పాటు చేసిన మహిళా పార్క్ ఈ నెల 14 నుంచి పూర్తిస్థాయిలో అందుబాటులోకి వస్తుందని మేయర్ వెంపడాపు విజయలక్ష్మి, డిప్యూటీ మేయర్ కోలగట్ల శ్రావణి అన్నారు. ఈ మేరకు గురువారం స్థానిక కార్పొరేషన్ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో వారు మాట్లాడుతూ, ప్రతిరోజూ ఉదయం 5 గంటల నుంచి 9 వరకు, మరలా సాయంత్రం 4 నుంచి 9 గంటల వరకు పార్క్‌లో ప్రవేశం ఉంటుందన్నారు. కేవలం మహిళలు, ఐదేళ్ల లోపు చిన్నారులకు మాత్రమే ప్రవేశం ఉంటుందన్నారు. పార్క్ నిర్వహణకు కమిటీ వేయడంతో పాటు ప్రత్యేక వేదికపై కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు చెప్పారు. అలాగే పార్క్‌లో ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన ఓపెన్ ఆడిటోరియంలో వినోదం కోసం చలనచిత్రాలు ప్రదర్శించనున్నట్లు తెలిపారు. సమావేశంలో డిప్యూటీ మేయర్ రేవతీదేవి, ఈఈ కె. శ్రీనివాసరావు, ఏఈ వెంకటేశ్వరరావు, వివిధ మహిళా స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు.

యోగాతో మానసిక దృఢత్వం



ఆహ్వానపత్రులను ఆవిష్కరిస్తున్న సభ్యులు

విజయనగరం: యోగాతో శారీరక, మానసిక దృఢత్వం సిద్ధిస్తుందని గీతం యూనివర్సిటీ అప్లైడ్ సైకాలజీ విభాగాధిపతి, ప్రొఫెసర్ కె.సునీత తెలిపారు. గురువారం స్థానిక గురజాడ స్వగృహంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడుతూ, యోగాపై విస్తృత ప్రచారమే లక్ష్యంగా ఈ నెల 13న జిల్లాలో ప్రత్యేక యోగా కార్యక్రమం నిర్వహించనున్నట్లు చెప్పారు. యోగాను ప్రజలకు మరింత చేరువ చేసేందుకు ప్రతిఏటా జూన్ 21న ప్రపంచ యోగా దినోత్సవం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. సామరస్య జీవన విధానమే లక్ష్యంగా, యోగాపై దేశ వ్యాప్తంగా విస్తృత ప్రచారాన్ని నిర్వహించేందుకు 100 రోజుల కౌంట్ డౌన్ కార్యక్రమం నిర్వహిస్తున్నారని, దీనిలో భాగంగా 39వ రోజు ప్రచార కార్యక్రమం విజయనగరంలో మే 13న జరుగుతుందని తెలిపారు. మే 13వ తేదీ ఉదయం 5.30 గంటల నుంచి 7 వరకు విజయనగరం కోటలోని మోతీమహల్‌లో జరిగే ప్రత్యేక యోగా కార్యక్రమంలో వివిధ విద్యాసంస్థలు, యోగా శిక్షణ సంస్థలు పాల్గొంటాయని తెలిపారు. అనంతరం ఆహ్వాన పత్రాలను ఆవిష్కరించారు. కార్యక్రమాల్లో ప్రతిఒక్కరూ పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. సమావేశంలో అకాడమీ ఆఫ్ యోగా కాన్సీషస్నెస్ అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ సీహెచ్ శ్రీకృష్ణ, యోగా నిపుణులు ఎ.స్.రవి, సన్యాసిరావు, భారతి పాల్గొన్నారు.

రీ సర్వేతో ప్రయోజనం



భూముల రీసర్వేను ప్రారంభిస్తున్న జెడ్పీటీసీ సభ్యుడు సన్యాసినాయుడు

నెల్లిమర్ల రూరల్: సమగ్ర భూముల రీసర్వేతో రైతులకు ఎంతో ప్రయోజనం చేకూరుతుందని జెడ్పీటీసీ సభ్యుడు గదల సన్యాసినాయుడు అన్నారు. మండలంలోని కొండవెలగాడలో భూముల రీ సర్వే కార్యక్రమాన్ని గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, జగనన్న శాశ్వత భూహక్కు – భూరక్ష పథకంలో భాగంగా గ్రామాల్లో ఎప్పటి నుంచో ఉన్న భూ సమస్యలు తొలిగిపోతాయన్నారు. రైతులు సర్వే సిబ్బందికి సహకరించాలని కోరారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నేతలు దంతులూరి గిరిబాబు, మొయిద అక్కోజీ, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

వ్యవసాయ శాఖ జేడీ పరిశీలన



అన్నంరాజుపేట మొక్కజొన్న కొనుగోలు కేంద్రం వద్ద మొక్కజొన్న గింజలను పరిశీలిస్తున్న వ్యవసాయ శాఖ జేడీ రామారావు

జామి: మండలంలోని అన్నంరాజుపేట గ్రామంలో నిర్వహిస్తున్న మొక్కజొన్న కొనుగోలు కేంద్రాన్ని వ్యవసాయ శాఖ జేడీ వి.టి.రామారావు గురువారం పరిశీలించారు. అనంతరం ఆయన మొక్కజొన్న సేకరణ, కొనుగోళ్లపై ఆరాతీశారు. రైతులు దళారుల బారినపడి మోసపోకుండా చర్యలు తీసుకోవాలని సిబ్బందికి సూచించారు. ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల వద్దే రైతులు వారి పంట అమ్ముకునేలా చూడాలన్నారు. కింటా మొక్కజొన్న ధర రూ.1962గా ప్రభుత్వం నిర్ణయించిందని, రైతులంతా ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల్లో పంటను విక్రయించి, లబ్ధి పొందాలని కోరారు. కార్యక్రమంలో వ్యవసాయ సహాయ సంచాలకులు పి.అన్నపూర్ణ, మండల వ్యవసాయ శాఖ అధికారి కిరణ్‌కుమార్ పాల్గొన్నారు.

పశువైద్య శిబిరం



పశువుల ఆరోగ్యం పరీక్షిస్తున్న పశువైద్యాధికారి అవినాష్

దత్తిరాజేరు: మండలంలోని దత్తి గ్రామంలో గురువారం నిర్వహించిన పశువైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. దాదాపు 130 పాడిపశువులకు దత్తిరాజేరు పశువైద్యాధికారి అవినాష్ వైద్య పరీక్షలు చేసి, అవసరమైన వాటికి చికిత్స, మందులు అందజేశారు. అనంతరం పశువుల్లో వచ్చే సాధారణ వ్యాధుల నివారణ చర్యలు, సీజనల్ వ్యాధులు రాకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలను రైతులకు వివరించారు.

అక్రమ వాటర్ ప్లాంట్లపై చర్యలు తీసుకోవాలి



సమస్యలపై మేయర్ విజయలక్ష్మికి వినతిపత్రం ఇస్తున్న రవికుమార్, తదితరులు

విజయనగరం:

మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని ఒకటో డివిజన్ పరిధి అయ్యప్పనగర్ స్వామి లేఅవుట్‌లో జనావాసాల మధ్య నిబంధనలకు విరుద్ధంగా ఏర్పాటు చేసిన వాటర్ ప్లాంట్‌పై చర్యలు తీసుకోవాలని కాలనీస్ అసోసియేషన్ నాయకులు రవికుమార్, విజయనగరం పట్టణ పౌర సంక్షేమ సంఘ కార్యదర్శి రెడ్డి శంకరరావు డిమాండ్ చేశారు. ఈ మేరకు నగర మేయర్ వెంపడాపు విజయలక్ష్మిని గురువారం కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ ప్రాంతంలో ఎటువంటి అనుమతుల్లేకుండా 500 అడుగుల లోతున బోరు తవ్వి నీటి వ్యాపారం చేయడంతో మిగిలిన కాలనీ వాసులకు నీరందని పరిస్థితి నెలకొందన్నారు. కార్యక్రమంలో అప్పన్న, గౌరి, సుధీర్, తదితరులు పాల్గొన్నారు.

